# అందరూ అతన్ని చూశారు

**కా**చీగూడా స్టేషన్‌లో ఆగింది లోకల్. కంపార్ట్‌మెంట్‌లోకి వచ్చింది ఐదారుగురే అయినా తోసుకుంటూ ఎక్కారు.

సూట్‌తో ఉన్న లావుపాటి బట్టతల పెద్దమనిషి గొణుగుతూ వచ్చి మోహన్ రెడ్డి ఎదురుగా కూర్చున్నాడు. ఆయన కోటు జేబులో పుస్తకంలా మడతపెట్టి దాచుకున్న న్యూస్‌పేపర్ మీద మోహన్‌రెడ్డి దృష్టి పడింది. ఆయన గొణుగుతున్న ధోరణిచూసి పేపర్ అడగటానికి సంశయించాడు మోహన్‌రెడ్డి. చిన్నస్టేషన్స్‌లో ఒకనిమిషం కూడా ఆగే ఓపికలేని లోకల్ అక్కడ తీరుబాటుగా కబుర్లు చెబుతూ ఆగింది.

"గుడ్ పీపుల్ కాంట్ లివ్ ఇన్‌దిస్ వర్ల్డ్... ఇట్స్ హారిబుల్... ఇట్స్ హారిబుల్..." అంటున్నాడు బట్టతల పెద్దమనిషి. విన్నవాళ్లు వివరాలు అడగాలన్న ఉద్దేశంతో అన్నట్టు. ఆరేళ్ల కొడుకుతో కబుర్లు చెప్పుకుంటున్న ముప్పయ్యేళ్ల కళ్లద్దాలాయన ప్రపంచాన్నే మరచిపోయి ఉన్నాడు. అతడికి ఈ పెద్దమనిషి గొణుగుడు పట్టలేదు. మోహన్ రెడ్డి పక్కన కూర్చున్న సిగరెట్ తాగుతున్న కుర్రాడు ఇంగ్లీషు సినిమావారపత్రికలో తలదూర్చి ఉష్ట్రపక్షిలా ఉన్నాడు. సీటులేక దిక్కులు చూస్తున్న కూరగాయల సంచి మోస్తున్న — తిరుపతి గుండు ---- ధోతీ — నుదుట నామము — నలభైయ్యేళ్లాయనకి ఆ ఇంగ్లీషు ముక్కలు అర్థమయినట్టులేదు.

న్యూస్‌పేపర్ అడగటానికి ధైర్యం చాలక బయటికి చూస్తూ కూర్చున్నాడు

మోహన్‌రెడ్డి. గుడ్ పీపుల్ కాంట్ లివ్ ఇన్‌దిస్ వర్ల్డ్... మనసులో కదుల్తూ ఉంది.

సరిగ్గా రైలు కదిలేటప్పుడు కేకలేసుకుంటూ, నవ్వుకుంటూ ఎక్కారు పద్దెనిమిది ఇరవైయ్యేళ్ల వయసు కుర్రాళ్లు ముగ్గురు. సారవంతమైన నేలలో మొలిచిన మొక్కల్లాగ ఉన్నారు. ఈ రైల్వేప్లాట్‌ఫారమ్ ఈ ట్రయిన్, ఈ కంపార్ట్‌మెంట్ — అంతా తమ వినోదానికే అన్నట్టు ఉన్నారు. కంపార్ట్‌మెంట్‌లో ఉన్న జనాన్ని చూసినట్టే లేదు వాళ్లు. ఆ లొల్లి విని చిరాగ్గా చూశాడు మోహన్ రెడ్డి. వాళ్లు సినిమాతార్ల పేర్లతో చాలా ద్వందార్థాలు సాగదీస్తున్నారు.

"వో రేఖారే — రేఖా"

"తో తూ బిస్వజిత్ క్యా?"

కార్నర్ సీట్‌లో ఓ అమ్మాయి కనిపించింది మోహన్ రెడ్డికి. శ్యామలంగా ఉంది. వెంట్రుకల్ని పల్లెటూరు వాళ్లలా దువ్వింది. అదే ఫేషన్ అవటం మూలాన. చూపులు చిలిపిగా ఉన్నాయి. ఎక్కడో బ్యాంక్‌లోనో, సెంట్రల్ గవర్నమెంట్ ఆఫీస్‌లోనో నాజూకయిన ఉద్యోగం చేస్తుండాలి. భుజానికి వేలాడేసుకునే ప్లాస్టిక్ బేగ్‌లో — ఆ బేగ్ ఆమె ఒడిలో పెట్టుకుంది. ఫిలింపేర్ లాంటి పత్రిక ఏదో మడిచి ఉంది. నుదుట బొట్టులేదు. కాళ్లకు మట్టెలు లేవు. ఆకుపచ్చ పువ్వుల పసుపు పచ్చ ఫుల్‌వాయిల్ చీర కట్టుకుంది.

"ఇయ్యాల్రేపు నీవు చాలా చెడ్డవాడివయి పోతున్నావురా విక్రమ్" అన్నాడు స్వెట్టర్ వేసుకున్న సన్నటి పొడవాటి ముక్కున్న కుర్రాడు. గొంతు సన్నగా చాలా బావుంది. ఆ మాట విన్న తర్వాత విక్రమ్ కడుపుబ్బేటట్టు నవ్వాడు.

ఆ నవ్వుకు ముప్పయ్యేళ్ల కళ్లద్దాలాయన అటు చూశాడు. ఆరేళ్ల కుర్రాడు అటువేపు వెతుకుతూ చూశాడు. సినిమా వారపత్రికలోంచి తలతీసి ఉష్ట్రపక్షి చూశాడటు. నామాలాయన వాళ్లవేపు తిరిగి నుంచుని ఏమయిందన్నట్టు చూశాడు. గొణుగుడుసూటు పెద్దమనిషి "వాట్స్ హేపెన్డ్... వాట్స్ ట్" అందర్నీ అడుగుతున్నట్టుగా చూశాడు.

ఆ నవ్వుకు మిగిల్న ఇద్దరుకూడా పగలబడి నవ్వి మళ్లీ 'అరెభాయ్ కమల్ చాలా చాలా మంచోడ్రా యీ ప్రపంచంల. ఆడు పెళ్లి కూడా చేసుకోడ్రా'. విసుర్లు.

పగలబడి నవ్వు మళ్లీ.

టెర్రీకాట్ గుడ్డల్లో ఉన్నారు. టైట్ పేంట్‌ల్తో. పాయింటెడ్ షూజ్‌తో, రిస్ట్‌వాచీలతో కంపార్టుమెంట్ తమ సొంత ఇల్లు అనుకున్నంత ఫ్రీగా ధైర్యంగా ఉన్నారు. ఆ కంపార్టుమెంట్‌లో మనుషులున్నట్టుగాని వాళ్లకి ఇబ్బంది ఉంటుందన్న ఆలోచనగాని వాళ్లలో ఎవరికీ ఎప్పుడూ తట్టినట్టులేదు.

"జిందగీ హమ్ సఫర్..." కూనిరాగం తీసి దాని వెనక పెద్ద కథ ఉన్నట్టు ఫక్కున నవ్వు.

విద్యానగర్ స్టేషన్ వస్తున్నది. దిగి వేరే కంపార్టుమెంటులోకి పోవాలనిపించింది మోహన్ రెడ్డికి. కాని సీట్ కంఫర్టబుల్‌గా ఉంది. ఈ ఆవారాగాళ్లు ఎక్కడ దిగుతారో వాళ్ల పద్ధతి చూస్తే సికింద్రాబాద్ వరకూ వచ్చేట్టు కన్పిస్తున్నారు. వాళ్ల ధోరణి చూస్తే టిక్కెట్ తీసినట్టు లేదు.

రైలు చప్పుడును మించిపోయింది వాళ్ల అల్లరి.

'విద్యానగర్‌లో రైలు ఆగకముందే దబదబా పది పన్నెండుగురు స్టూడెంట్స్ ఎక్కారు. గోలగోల. కేకలు. పిలుపులు. పలకడాలు. హైస్కూల్ పిల్లలు. పరీక్షలు రాసి వచ్చినట్టున్నారు. క్లిప్‌లతో అట్టలు. సైక్లో స్టయిల్డ్ కొచ్చిన్ పేపర్లు. కాకీ యూనిఫారమ్. తెలుగు మీడియమ్‌లో చదువుకునే పేద పిల్లలు. తిండిచాలక గుడ్డలు ఉతుక్కునే అవకాశాల్లేక అడవుల్లోని మొక్కల్లాగ పిచ్చిపిచ్చిగా పెరిగిన పది పదయిదేళ్ల లోపల పిల్లలు. కూర్చునే సీట్ల కోసం వెతుకులాడుతూ. ఒకరిద్దరు విండోస్‌లోంచి లోపలికి దూకారు.

"గాడిదల మందొచ్చింద్రా, గాడిదల మంద."

మోహన్‌రెడ్డికి కోపమొచ్చింది.

ఎర్రటి పెదాల బొద్దుచెంపల యువకుడు హైస్కూల్ పిల్లల్ని గురించి వ్యాఖ్యానిస్తున్నాడు.

దానిక్కూడా నవ్వుకున్నారు వాళ్లలో వాళ్లు.

జాగాలు వెతుక్కుంటున్న పనిలో హైస్కూల్ కుర్రాళ్లు ఇంకేమీ వినిపించు కోవటంలేదు.

రైలు కదిలిపోయింది.

ఎవరో రైలు ఎక్కలేక ఉండి పోయాడని అంతా కిటికీల్లో తలదూర్చి ప్లాట్ ఫారమ్ మీదికి చూశారు. ఎవరో అరిచారు. ఒకటి రెండు నిమిషాల్లో మళ్లీ సర్దుకున్నారు. నుంచున్నారు. పరీక్షలో నకలు గురించి మాటలు, సార్ల గురించి కబుర్లు. దానికి తోడు అది చివరి పరీక్షమల్లే ఉంది. మరింత ఉత్సాహంగా కన్పిస్తున్నారు.

మోహన్‌రెడ్డికి తను చదువుతున్న హైస్కూల్ రోజులు గుర్తొచ్చాయి! పేదరికం. కావలసిన అవసరాలని సయితం కొనుక్కోలేనితనం. పుస్తకాలను అడుక్కోవటం. చినిగిపోయిన చొక్కాలను కుట్టుకోవటం. బొత్తాలు కొనుక్కోవ టానికి పైసల్లేక స్కూల్‌కి దుమ్మా కొట్టడం. సాయంత్రం ఆకల్తో వస్తే అమ్మ రొట్టె పెట్టకపోతే ఏడవటం. పెద్దన్నయ్య కొట్టటం —— అన్నీ కలిసిన బాధ కొంచెం సేపు ఏనుగు అడుగు మీద

పడినట్టు.

ఆ ముగ్గురు కుర్రాళ్లు అటు ధోతి ఆయన మీద పడినట్టున్నారు.

'మహమూద్ రే' అని హిందీ సినిమాని గురించి చెప్పుకుని ఒక్కసారి ముగ్గురూ చప్పట్లు కొట్టినవ్వారు.

ఆ కార్నర్‌సీట్ అమ్మాయి ముఖం తిప్పలేదు. మోహన్‌రెడ్డికి విపరీతంగా కోపమొచ్చింది. లేచి వాళ్లతో తగూ పెట్టుకోవాలనుకున్నాడు. మళ్లీ కంపార్టుమెంట్‌లో జనాన్ని అందర్నీ చూశాడు. గొణుగుతున్న లావుపాటి సూటు మనిషి నోటిలో చూయింగ్ గమ్ ఉన్నట్టు నములుతూ కోటుజేబులో చేయిపెట్టుకుని కూర్చున్నాడు. కొడుకుతో కబుర్లు చెబుతున్న కళ్లద్దాలాయనకి వాళ్లని చూస్తే నవ్వొచ్చింది. కోతులు పోట్లాడుతుంటే సంతోషించినట్టు ఆరేళ్ల కుర్రాడు వాళ్లను చూసి పెదాలువిప్పుకుని నవ్వుతున్నాడు. అటుపక్క అమ్మాయి దగ్గర కూర్చున్న నలభైయ్యేళ్ల ఓ గుజరాతీ చీరకట్టు, ఇద్దరు ముసలమ్మలు, వాళ్ల ఎదురుగా ఒక నల్లటి బురఖా ---- ఇది ఇంతే. ఎక్కడా ఇది ఇంతే అన్నట్టు, అలవాటు పడిపోయినట్టుగా పట్టించుకోకుండా కూర్చున్నారు. ఉష్ట్రపక్షి వేరే సిగరెట్ వెలిగించుకుని, వేరే పేజీ తిరగేసి దాంట్లో దూరాడు. రైలు పొగతో బొగ్గురవ్వలొచ్చిపడుతున్నాయి. హైస్కూల్ కుర్రాళ్లు సరదాగా కబుర్లు చెప్పుకుంటున్న వాళ్లు —— లంగ గాళ్ల గొడవకి నోరుమూసుకుని వాళ్లని కొరకొర చూస్తూకూర్చున్నారు. ధనవంతుల్ని చూస్తే ఏర్పడే భయభక్తులు కూడా ఆ పిల్లల్లో కొందర్లో కనిపించాయి. ఆ పిల్లల్లో రోమన్ ముక్కు, అందమైన కళ్లు, గిరజాల జుత్తు, ఎర్రటి పెదాలు ఉన్న కుర్రాడు 'ఏందిర భయి ఏంది ఈ లంగగాళ్లు' అని, ఎవరూ మాటాడకపోయేసరికి ఊరుకున్నాడు. రైలు ఎలక్ట్రీ లైన్లతో, టెలిగ్రాపు తీగెల్తో, సిమెంట్ రోడ్లతో పాటు పరుగెత్తుతున్నది. పక్కనే పోతున్న రోడ్లమీద లారీలు, బస్సులు, కార్లు, రిక్షాలూ, హడావిడిగా పరుగులెడుతున్న జనంతో సాయంత్రం కిక్కిరిసిపోయినట్టుంది.

సూర్యుడు పెద్దపెద్ద మేడల వెనక్కి జారిపోయి మళ్లీ పేదల గుడిసెలమీద కనిపిస్తున్నాడు.

జామై ఉస్మానియాలో రైలు ఆగింది.

కళ్లద్దాలాయన, పిల్లవాడు, నల్ల బురఖా దిగిపోయారు. మిగిలిన వాళ్లు సికింద్రాబాద్ వరకు దిగేట్టులేరు.

మోహన్‌రెడ్డికి ఇది వేరొక ప్రపంచం అనిపించింది. ఆఫీసులో అంతా యుద్ధం ముచ్చట్లతో ఏమవుతుందో అన్న ఆందోళనతో ఉన్నారు. యూనియన్ సెక్రటరీ ఈ యుద్ధం చాలాకాలం నడుస్తుందన్నాడు. ఇంకా ధరలు పెరిగిపోతాయన్నాడు. ఎప్పుడూ

న్యూస్ పేపర్ మొహం చూడనివాడు సైతం లేటెస్ట్ న్యూస్ చెప్పేస్తున్నాడు. అమెరికా సప్తమ నౌకాదళం బంగాళాఖాతంలోకి వస్తున్నదంట. ఆరువందల ఇరవై అయిదు నౌకలు దాన్లో ఉన్నాయంట. ఎదురుదాడులు చేసే ట్రిపోలి యుద్ధనౌక సిద్ధంగా ఉందంట. ఇవన్నీ పదిహేనుగురు అమెరికన్ పౌరుల్ని కాపాట్టానికి వస్తున్నాయంట. మొదట అట్లాగే సాకులు చెప్పి తర్వాత భారత ప్రభుత్వం కవ్వింపు చర్యలు చేస్తున్నదని ఓరోజు ప్రకటించి, రష్యా ఎదురు దాడులు చేసిందని మరోరోజు ప్రసారం చేసి అటు విశాఖపట్టణాన్ని, ఇటు కలకత్తాని ఒకే సారి ధ్వంసం చేయొచ్చునట. ఇంకాపోతే మన సముద్రజలాల్లో రష్యా జలాంతర్గాములు ఓ పదిహేనయినా ఉండొచ్చంట. మొత్తంమీద ఈ అగ్రదేశాలు భారత ఉపఖండాన్ని రణభూమిని చేసుకుని తమ బలాబలాలు తేల్చుకునేట్టున్నాయి. వార్తలని చాలా కోణాలనించి చర్చిస్తున్నారు. దేశరక్షణనిధికోసం తను కూడా ఒకరోజు పే ఇస్తానని ప్రకటించాడు. రెఫ్యూజీ రెవిన్యూ స్టాంపులకూ, అదనపు పోస్టేజీకి సామాన్యులే దొరికారా? ఈ దేశంలో కోట్లకి పడగలెత్తిన వాళ్లున్నారు. కోట్లు దోచుకుంటున్న వాళ్లంతా, వాళ్ల దేశభక్తి అంతా ఏమయిందని అడిగిన వాడల్లా ఇప్పుడు దేశం ఎదుర్కొంటున్న క్లిష్టపరిస్థితుల గురించి మాట్లాడుతున్నాడు.

రైలు కదులుతూ ఉండగా నల్లటి స్వెట్టర్ భుజం మీదవేసుకున్న యువకుడు — ఎక్కడో నాల్గో తరగతి ఉద్యోగిలా ఉన్నాడు— ఎక్కుతూ ఎక్కుతూ ఏమొచ్చిందో ఆ ఆవారా కుర్రాళ్లతో పోట్టాటపెట్టుకున్నాడు. మోహన్ రెడ్డి తన ఆలోచనల్లో మునిగిపోయాడు. వాళ్ల గొడవ పట్టించుకోలేదు. అమ్ముగూడాలో అన్నయ్య ఉన్నాడు. ఏ రోజన్నా పోస్టింగ్ రావొచ్చు... అని ఫోన్ చేశాడు. పోయి చూసి రావాలని బయల్దేరాడు. అన్నయ్య యీఎమ్యీ లోనే ఉన్నా ఆర్టిలరీలో ఉన్న ప్రమాదాలన్నీ ఉంటాయి. యుద్ధం అంటే ఎవ్వరికీ సంతోషం కాదు. అయినా తప్పదు, వదిన, పిల్లలు, అన్నయ్య —— వాళ్లని చూసి రావాలని బయల్దేరాడు.

మళ్లీ గొడవ. నవ్వులు.

వచ్చి స్కూల్ కుర్రాళ్ల దగ్గర కూర్చున్న ఆ నల్లటి స్వెట్టర్ యువకుడు మోహన్ రెడ్డి కంటె చిన్న ఉండొచ్చు. మనిషి లేతగా కన్పిస్తున్నాడు. కొత్తగా పెళ్లయిందో ఏమో. రాత్రిడ్యూటీకి పోతున్నట్టున్నాడు. ఇంటి దగ్గర భార్య దిగులు కళ్లతో చూసిన చూపులు గుచ్చి గుచ్చి వేధిస్తున్నట్టు పరాకుగా ఉన్నాడు. రేపు ఉదయం వరకు ఈ విరహం మోయక తప్పదన్నట్టుగా ఇంకా ఇంటి ధ్యాసతోనే ఉన్నాడు!

మోహన్‌రెడ్డికి ఆ నల్లటి స్వెట్టర్ యువకుడు బాగా ఆకర్షించాడు!... శ్యామలంగా సన్నగా పల్చగా ఉన్నా నరాలసత్తువున్నట్టు అన్పించింది. వాళ్లతో తగూ

పెట్టుకున్నందుకో ఏమో అతడికి గుండెబలం బాగా ఉందనిపించింది. పెద్దఎత్తున పెద్దకండల శరీరం లేకపోయినా చేవఉన్న మనిషిలా కనిపించాడు.

ఆ ముగ్గురు కుర్రాళ్ల ఇకిలింపులు, సకిలింపులు, గాండ్రింపులు సాగుతూనే ఉన్నాయి. గాండ్రింపుకు నవ్వు. సకిలింపుకు నవ్వు.

వాళ్లని చూస్తుంటే మోహన్‌రెడ్డికి వళ్లు మండిపోతూ ఉంది. ఇలాంటి వాళ్ల సుఖాలకోసం, సంతోషాలకోసం ఆ సరిహద్దుల్లో ప్రాణాలు త్యాగం చేస్తున్న జవాన్ల వరసలో తన అన్నయ్య కూడా ఉన్నాడు. కాని ఈ దేశం వీళ్లది. వీళ్ల సంతోషాలకి రంగభూమి. ఈ కంపార్ట్‌మెంట్ తమ సొంతం అనుకున్నట్టే ఈ దేశాన్ని కూడా వాళ్లు సొంతం చేసుకున్నారు.

మోహన్‌రెడ్డికి మరికొంత సేపటికి సత్యవ్రత్ గుర్తొచ్చాడు. సత్యవ్రత్ పోలికలే అన్నీ. ఇప్పటికి తెలిసొచ్చింది. ఆ నల్ల స్వెట్టరాయన్ని తను లైక్ చేస్తున్నందుకు ఒక కారణం. సత్యవ్రత్ పోలికలన్నీ. ఆ చిన్న కళ్లూ, లావుముక్కు, సన్నటి పెదాలు, నుదురుమీద పడే జుత్తూ, లావుపాటి చెవుతమ్మలు, చిన్న పలువరస, తేటున్న చర్మం —— అన్నీ సత్యవ్రత్ పోలికలే.

సీతాఫల్‌మండి వచ్చింది. లోకల్ ఆగింది. కోటు దిగిపోయింది. గుడ్ పీపుల్ కాంట్‌లివ్ ఇన్ దిస్ వర్ల్డ్ అంటున్నట్టే గొణుగుతూనే దిగిపోయాడు. ముగ్గురు నలుగురు స్కూలు పిల్లలు దిగిపోయారు. ఓ యిద్దరు అరవ అమ్మాయిలు ఎక్కారు. ఒక ఎముకల గూడు పోలీసు వాడు, ఒక లావుపాటి పసుపుపచ్చ చీర లోపలికి వచ్చారు.

మోహన్ రెడ్డి అరవ అమ్మాయిల చేతి గడియారం వేపుచూసి టయిమ్ అడిగాడు. ఐదున్నర. ఇది అమ్ముగూడా ఎప్పుడు చేరుతుందో. సికింద్రాబాద్ స్టేషన్‌లో దీన్నెంతసేపు ఉంచేస్తారో. మళ్లీ తను రాత్రి ఇంటికి తిరిగి వచ్చేయాలి. ఇంట్లో కిరోసిన్ లేదు. బొగ్గులు కొనుక్కురమ్మంది తల్లి. తీసుకురాలేదు. అన్నయ్యను ఒక్కసారి చూసేసి రావాలని బయల్దేరాడు ఆఫీసులో పర్మిషన్ తీసుకుని అరగంట ముందే వచ్చాడు. గుండెలో ఓ పక్క చిన్న అనుమానం. అన్నయ్య టెలిగ్రాం ఆర్డర్స్‌మీద బార్డర్‌కి వెళ్లిపోయి ఉంటాడేమోనని. నాలుగయిదు దినాల్నించి వెళ్లాలనుకుంటూ వెళ్లలేక పోతున్నాడు.

ఏమయిందో సత్యవ్రత్ తాపీగా నుంచుని స్కూల్ కుర్రాళ్లకి స్వెట్టర్ ఇచ్చి ముందుకొస్తున్నాడు.

'ఏమంటున్నార్రా?. బొక్కలిరగదంత' అని మండిపోతూ చూశాడు వాళ్లని.

ఆ కుర్రాళ్లలో ఒకడు——

'ఏం లేదన్న తప్పయిపోయిందన్నం గద. చెమించమన్నాం గద. ఏం లేదన్నా.

నీవు కూసో అన్నా' అని బతిమాలుతున్నాడు, బొద్దు చెంపల ఎర్రటి కుర్రాడు.

ఒక్కసారి హైస్కూల్ కుర్రాళ్లంతా నుంచున్నారు.

'ఇచ్చుకో నాలుగిచ్చుకో' అని ఒక్కగొంతుతో అరిచారు వాళ్లు. సికింద్రాబాద్ స్టేషన్ దగ్గరయింది. సిగ్నల్ ముందు స్లో అయింది రైలు.

ఇద్దరు దిగిపోయారు. 'ఇచ్చుకో ఇచ్చుకో' పిల్లలు అరుస్తున్నారు. 'నీకాల్మొక్కుతానన్నా ఆడు బద్మాష్ అన్నా నన్నొదులన్నా'

'వొద్దుబాబూ, పోనీ పోనీ,...' అని కూరల సంచి, తిరుపతి గుండు —— ధోతి —— నామాలాయన వారిస్తున్నాడు. సత్యవ్రత్ తగ్గలేదు. 'ఈల్ల పోకిరీ సూడరాదు?' అని విడిచేశాడు. ఆ అవారా కుర్రాడు పడిపోయేది కూడా కానక, మీటర్‌గాజ్ రైలునుంచి దిగిపోయి దిగిపోయిన స్నేహితుల్ని వెతుక్కోనారంభించాడు. హైస్కూల్ కుర్రాళ్లంతా సంతోషంతో వాడు దిగుతున్నప్పుడు ఒకటే అరిచారు.

'ఇచ్చుకొనాల్సుండే' అని మాత్రం రోమన్ ముక్కు కుర్రాడు నవ్వుతూ అభినందించాడు. తన నల్ల స్వెట్టర్‌ని తీసుకుని నుంచున్నాడు సత్యవ్రత్.

రేపు ఆఫీసులో ఈ సంగతి చెప్పాలి సత్యవ్రత్‌కి అనుకున్నాడు మోహన్ రెడ్డి. అటు ఆ మూలకూర్చున్న నుదుట బొట్టులేని అమ్మాయి సత్యవ్రత్‌ని చూస్తూ ఉంది. అరవ అమ్మాయిలు అటు సత్యవ్రత్‌ని చూస్తున్నారు. గుజరాతీ ఆమె అటు చూసింది. ఆ ముసలమ్మలు చూశారు అతణ్ని.

✶ ✶ ✶

'తూరుపు' కథా సంకలనం

*1974*